క్లుప్తంగా

జిర్రావారిపాళెం గ్రామస్తుల రాస్తారోకో

కలిగిరి: కలిగిరిలో జిర్రావారిపాళెం గ్రామానికి చెందిన మలిరెడ్డి శ్రీనివాసులు, ఆయన కుమారుడు చంద్రపై జనసేన మండల కన్వీనర్ బండారు లక్ష్మీనారాయణ శుక్రవారం రాత్రి దాడి చేశారు. హోటల్ వద్ద తండ్రీ కొడుకులపై అకారణంగా దాడి చేయడంతో జిర్రావారిపాళెం గ్రామస్తులు భారీ సంఖ్యలో కలిగిరికి చేరుకున్నారు. జనసేన నాయకుడు లక్ష్మీనారాయణను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు.

వైభవంగా గంగమ్మకు మండల పూజలు

ఉదయగిరి : గండిపాళెంలో జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు జరిపి 41 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం మండల పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధన, కలశ స్థాపన, అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేషాలంకరణ, కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి జల్లి స్నానం, గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కాగా గ్రామానికి చెందిన స్వర్గీయ లోక రాధాకృష్ణమూర్తి కుమారుడు, శివాలయం అర్చకుడు వెంకటప్రసాద్‌శర్మ తన తండ్రి జ్ఞాపకార్థంగా గంగమ్మకు వెండి కిరీటాన్ని బహూకరిస్తానని ప్రకటించినట్లు ఆలయ చైర్మన్ పాముల రమణయ్య తెలిపారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 423 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 343 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.210, సరాసరిన రూ.258.50 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి నివేశ్‌కుమార్‌పాండే తెలిపారు.

సబ్సిడీపై జిప్సం, వేపనూనె పంపిణీ

అనుమసముద్రంపేట: మండలంలోని రైతులకు 50శాతం సబ్సిడీపై జిప్సం, వేపనూనెను ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఆహార పోషక పక్షం–అపరాలు కింద వేపనూనె, జాతీయ ఆహార నూనె గింజల ఉత్పత్తి మిషన్ కింద జిప్సంను పంపిణీ చేసినట్లు ఏఓ టీ రజని తెలిపారు. ఏఈఓలు, వీపీఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతారామపురం : మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీహరి శుక్రవారం తెలిపారు. ఉదయగిరిలోని 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 33కేవీ సీతారామపురం ఫీడర్‌కు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూరుశాతం లక్ష్యాలను సాధించాలి

వరికుంటపాడు: వైద్యఆరోగ్య సిబ్బంది కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలని వైద్యాధికారిణి కరీష్మా అన్నారు. వరికుంటపాడు పీహెచ్‌సీలో వైద్య ఆరోగ్య సిబ్బంది సిబ్బందితో సెక్టార్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ ఇంటింటి సర్వేలను పక్కాగా చేపట్టాలన్నారు. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి ఎంసీపీ కార్డులు అందజేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. సీహెచ్‌ఓ రాజశేఖర్‌రాజు, పీహెచ్‌ఎన్ సువార్తమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

వితంతు పింఛన్లకు అవకాశం

సీతారామపురం: మండలంలో 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్యన పింఛన్ పొందుతూ ఏదైనా కారణంతో మరణించిన వ్యక్తి భార్యకు వితంతు పింఛన్ పొందేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ శుక్రవారం తెలిపారు. అలాంటి వారు ఆధార్, భర్త పింఛన్ పుస్తకం, గుర్తింపు కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం, తదితరాలతో సచివాలయాల్లోని సంక్షేమ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

మెదడువ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం

ఆత్మకూరు: మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పట్టణంలోని 13వ వార్డుకు చెందిన తేజేష్ అనే బాలుడికి జిల్లా వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు డాక్టర్ ప్రణీత్ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. తేజేష్ జీవిత పర్యాంతం మందులు వాడాల్సి ఉంటుందని, ప్రస్తుతం ఏడాదికి సరిపడా మందులు అందజేస్తున్నానని, భవిష్యత్తులోనూ తమవంతు సాయం అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట వైద్యులు కుమార్, టీ అశోక్, తదితరులు ఉన్నారు.

భూసార పరీక్షలతో భరోసా

- భూసారం అత్యవసరం
- విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగం
- క్రమంగా సారం కోల్పోతున్న భూమి
- ఏటా పెరుగుతున్న ఎరువుల భారం
- మట్టి పరీక్షలతో అన్నదాతలకు ప్రయోజనం


రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వీపీఏ

సీతారామపురం : పంటలకు ఇష్టానుసారంగా ఎరువులను వినియోగించడం వల్ల రైతులకు పెట్టుబడులు పెరగడమే గాక భూసారం తగ్గుతుంది. ఫలితంగా పంటలు సక్రమంగా పండక దిగుబడులు తగ్గుతాయి. నేల స్వభావం తెలుసుకోకుండా ఎరువులు వేసినా ఆశించిన ఫలితం ఉండదు. భూమి ఆరోగ్యంగా తగిన పోషకాలతో ఉన్నప్పుడే సత్ఫలితాలు సాధ్యం. ఎంత మోతాదులో ఎరువులు వేయాలనే విషయాలను తెలుసుకోవాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. వాటి నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటే వ్యయభారాన్ని రైతులు తగ్గించుకోవచ్చు. పంటలు బాగా పండితేనే రైతులకు ఆనందం. దిగుబడి ఎక్కువగా రావాలంటే ఏమి చేయాలి..పెట్టుబడి ఎలా తగ్గించుకోవాలి..నేల ఆరోగ్యం..భూమిలో సరైన పోషకాలు ఉన్నాయా.. ఏ పంట సాగు చేయాలి.. ఎరువులు ఎంత మోతాదులో వినియోగించాలనే విషయాలపై అవగాహన కల్పిస్తే అన్నదాతలు ఆర్థికంగా బలోపేతం అవుతారు.

ఖరీఫ్ సాగును దృష్టిలో ఉంచుకుని..

రానున్న ఖరీఫ్ సాగును దష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని మండలాల్లో భూసార పరీక్షలను నిర్వహించడంలో వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. జిల్లాలో 31,231 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలో 2,346, వింజమూరు సబ్‌డివిజన్ పరిధిలో 3,576 మట్టి నమూనాలను సేకరించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. పొలాల్లో చెట్లనీడ, కాలిబాట, పంట కాలువలు, గట్లు వెంబడి కాకుండా మధ్యలో వీ ఆకారంలో 15 సెంటీమీటర్ల లోతులో గుంత తవ్వి మట్టి నమూనాలను సేకరిస్తారు. ఆరున్నర ఎకరాలకు ఒక నమూనాను తీసుకుంటారు. ఎనిమిది నుంచి పది చోట్ల సేకరించిన మట్టిని ఒక గోనె సంచిపై వేసి కలుపుతారు. దాన్ని నాలుగు భాగాలుగా విభజించి ఎదురు ఎదురుగా ఉన్న భాగాలను కలిపి వాటిలో ఒక భాగాన్ని తీసుకుని అందులో అర కిలో చొప్పున మట్టిని సేకరించి భూసార కేంద్రానికి పంపుతారు. అనంతరం ఫలితాల కార్డులను రైతులకు అందజేస్తారు. జీపీఎస్ ఆధారంగా సేకరించిన చిత్రాలను ఎస్‌హెచ్‌సీ యాప్‌లో అప్లోడ్ చేసి ఫలితాల స్వభావాన్ని రైతుల సెల్‌ఫోన్లకు తెలుగులో నేరుగా పంపేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఉద్యాన పంటలకు మట్టి నమూనాల సేకరణ, చౌడు నేలల యాజమాన్య పద్ధతులు, క్షారగుణం మారితే ప్రత్యామ్నాయాలపై క్షేత్రస్థాయిలో రైతులకు వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పిస్తారు.

మే నెలాఖరులోగా ఫలితాలు

జూన్ నుంచి ఖరీఫ్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆ లోపే మట్టి నమూనాలు సేకరించి ఫలితాలు అందించాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. భూమిలోని ప్రధాన పోషకాలు అయిన నత్రజని, భాస్వరం, పొటాష్ పరిమాణాల్లో మార్పులను పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. ఫలితాలు వచ్చిన తర్వాత భూమిలో ఏ సూక్ష్మధాతువుల లోపం ఉందో తెలుసుకుని రైతులు ఎరువులను వినియోగించాలని, లేకుంటే నేలసారం కోల్పోయి దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందని అధికారులు సూచిస్తున్నారు.


మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

ఉదయగిరి నియోజకవర్గంలో భూసార పరీక్షల లక్ష్యం

మండలం	నమూనాల సంఖ్య
సీతారామపురం	420
ఉదయగిరి	340
దుత్తలూరు	480
వరికుంటపాడు	560
మర్రిపాడు	546
వింజమూరు	600
కలిగిరి	1002
కొండాపురం	1014
జలదంకి	960

నమూనాల సేకరణను ప్రారంభించాం



ఇప్పటికే భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు మట్టి నమూనాల సేకరణను ప్రారంభించాం. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఏఏ పంటలు వేసుకోవచ్చు.. ఎంత మోతాదులో ఎరువులు వాడాలి.. ఏ మేరకు ఫలితం ఉంటుందనే వివరాలను రైతులకు వివరిస్తాం. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పంటలను సాగుచేసుకుని ఎరువులను వినియోగిస్తే రైతులు పెట్టుబడులు ఆదా చేసుకోవడంతో పాటు మంచి దిగుబడులు పొందవచ్చు.

– చెన్నారెడ్డి, ఏడీఏ, ఉదయగిరి

బత్తాయి తోటల పరిశీలన



ఉదయగిరి: మండలంలోని దాసరపల్లి పంచాయతీలో బత్తాయి తోటలను మండల ఉద్యాన అధికారిణి జయశ్రీ శుక్రవారం పరిశీలించారు. వేసవిలో నీటి ఎద్దడి నుంచి తోటలను కాపాడుకునేందుకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను రైతులకు సూచించారు. ప్రస్తుతం బత్తాయి దిగుబడులు మొదలవుతున్న నేపథ్యంలో ధరలు కొంచెం తక్కువగా ఉన్నాయని, మే నెలలో మంచి ధరలు పలికే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం ఉద్యాన శాఖ ద్వారా అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలపై అవగాహన కల్పించారు. నీటికుంటలు తవ్వుకునే రైతులకు రూ.75 వేల వరకు సబ్సిడీ అందజేస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట ఆదర్శ రైతులు గౌస్‌మొహిద్దీన్, నారపరెడ్డి, అప్పసముద్రం వీహెచ్‌ఏ శేఖర్, తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

సంగం: మండల పరిషత్ కార్యాలయంలో బాల్యవివాహాల నియంత్రణపై పొదుపు సిబ్బందితో అవగాహన సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ షాలెట్ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. గ్రామాల్లో బాల్యవివాహాలు చేస్తుంటే వెంటనే 1098కు సమాచారం అందజేయాలని సూచించారు. ఏపీఓ రవిశంకర్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, ఐసీపీఎస్ పీఓ సమతా తదితరులు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఉగ్రదాడులను ముక్తకంఠంతో ఖండించాలి


ఆత్మకూరులో మృతులకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


వింజమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పౌరులు

ఆత్మకూరు: కాశ్మీర్‌లోయలో పర్యాటకులపై ఉగ్రదాడులను ప్రతిఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బీఎస్సార్‌సెంటర్‌లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అమాయక ప్రజలను బలితీసుకోవడం బాధాకరమన్నారు. ఇలాంటి ఉగ్రవాదుల పిరికిపంద చర్యలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదిశేషయ్య, పట్టణాధ్యక్షుడు నాగలపాటి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఎస్సీసెల్ పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, లాయర్ల కమిటీ కన్వీనర్ నందా ఓబులేసు, మైనార్టీ నాయకురాలు షేక్ పర్వీన్, ఎస్‌కే రహీం, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, నాగా సుబ్రహ్మణ్యంరెడ్డి, కల్పనారెడ్డి, జమీర్, రిజ్వాన్, శ్రీను, సురేష్ యాదవ్, నందవరం ప్రతాప్, రమేష్‌రెడ్డి, మహమ్మద్ రఫీ, జనార్దన్‌రెడ్డి, కాకివాయి నాగిరెడ్డి, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

కావలి: కాశ్మీర్ లోయలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ కావలి జామియా మసీద్ వద్ద ఇమామ్ మౌలాని అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో ముస్లింలు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాం మతం శాంతి, ప్రేమను కాంక్షిస్తుందని హింసకు తావులేదన్నారు. భారతదేశంలోని అన్ని మతాలు, కులాలు సమానత్వం అనుభవిస్తుంటే మతం ముసుగులో ఉగ్రవాదులు కాశ్మీర్ టూరిస్టులపై మారణకాండను సృష్టించడం పిరికిపంద చర్య అన్నారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన భారతీయుల ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నామన్నారు. ఉగ్రవాదులను ఏరిపారేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ఉదయగిరి(వింజమూరు): కాశ్మీర్‌లోయలో పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ వింజమూరులో శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. బంగ్లా సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఉగ్రదాడిలో అశువులు బాసిన వారికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సంఘీభావం ప్రకటించి ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణ పౌరులు ఏ రఘురామిరెడ్డి, గువ్వల రవీంద్రరెడ్డి, కదిరి రంగారావు, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనను బాధ్యతగా తీసుకోవాలి


ఏఎస్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది


సోమశిల: అనంతసాగరంలో..


కలిగిరిలో..


ఉదయగిరిలో..

ఉదయగిరి/వరికుంటపాడు/ సీతారామపురం/ సంగం/ అనుమసముద్రంపేట/సోమశిల : మలేరియా నిర్మూలనను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎం శివకల్పన అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయగిరిలో గండిపాళెం పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలతో మలేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. చలితో కూడిన జ్వరం మలేరియా లక్షణాలు అని, రక్తపరీక్ష ద్వారా నిర్ధారించవచ్చని తెలిపారు. పరిసరాల శుభ్రత, డ్రైడేను పాటించడం ద్వారా మలేరియాను అరికట్టవచ్చని తెలిపారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి నోషాద్‌బాబు, ఆరోగ్య బోధకుడు కే వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వరికుంటపాడులో పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యాధికారిణి కరీష్మా ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది రాజశేఖర్‌రాజు, సువార్తమ్మ, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు. సీతారామపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఎంపీహెచ్‌ఈఓ మజీద్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలిగిరిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యాధికారిణి బీ గీతారెడ్డి ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. సంగంలో పీహెచ్‌సీ వైద్యాధికారి బీ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతసాగరంలో పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యాధికారులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణి ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. ఏఎస్‌పేటలో పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు సురేష్‌బాబు, మంజులమ్మ, ఎంపీహెచ్‌ఈఓ చిన్నయ్య, పీహెచ్‌ఎన్ సులోచన, సూపర్‌వైజర్లు రషీద్, కుమారి, హెల్త్ అసిస్టెంట్లు ఫణి, రసూల్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.


సీతారామపురంలో..


వరికుంటపాడులో..

బీమా నగదు అందజేత



కావలి: ఉగ్రవాదుల దాడిలో అశువులు బాసిన పట్టణానికి చెందిన సోమిశెట్టి మధుసూదన్ కుటుంబానికి ఎల్‌ఐసీ కావలి బ్రాంచ్ వారు బీమా నగదును శుక్రవారం అందజేశారు. జీవన్‌శ్రీ పాలసీ డెత్‌క్లెయిమ్ సెటిల్‌మెంట్ కింద రూ 10,74,920 చెక్కును నామినీ అయిన మధుసూదన్ తండ్రి తిరుపాలుకు అందజేశారు. డెత్ సర్టిఫికెట్ లేకుండా మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా క్లెయిమ్ సెటిల్ చేశామని ఎల్‌ఐసీ నెల్లూరు డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ కే రామకృష్ణయ్య తెలిపారు.

విద్యతో ఉన్నత శిఖరాలు



జలదంకి: విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బ్రాహ్మణకాక్రలోని శ్రీవిద్యానికేతన్ స్కూల్‌లో గురువారం రాత్రి నిర్వహించిన వార్షిక వేడుకలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతిలోనే ఉందన్నారు. విద్యార్థులు కష్టపడి చదవి దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరస్పాండెంట్ మారెళ్ల బ్రహ్మారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, మాలేపాటి చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి

కొండాపురం: ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఏఓ షేక్ సైదా సూచించారు. మండలంలోని చింతలదేవి, ఉప్పలూరు పంచాయతీల్లో భూసార పరీక్షలపై రైతులకు శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. అనంతరం రైతుల పొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

కావలి: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కావలి మండల సమాఖ్య అధ్యక్షురాలు డీ థెరిసా అన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో సంఘబంధాల అధ్యక్షులు, కార్యదర్శులతో ఈసీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. పలువురు అధికారులు పాల్గొని బాల్య వివాహాలను అరికట్టాలని సూచించారు. పోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, సైబర్ క్రైమ్ 112, బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కృష్ణారావు, ఐసీపీఎస్ అడ్వొకేట్ మంజుల, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కృష్ణమ్మ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జిగా ఏ గీతావాణి


జడ్జిని సత్కరిస్తున్న న్యాయవాదులు

కావలి: కావలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా ఏ గీతావాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై కావలికి వచ్చారు. కావలి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాటా సురేందర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ నల్ల జయప్రకాష్, సీనియర్ న్యాయవాది కలికి శ్రీనివాసులరెడ్డి, ట్రెజరర్ అభిషేక్, తదితరులు మర్యాదపూర్వకంగా జడ్జిని కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

జాగా కనిపిస్తే పాగా


స్థలాన్ని చదును చేసి కంచె వేసేందుకు రాళ్లు తోలిన దృశ్యం

- యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణ
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెలరేగిపోతున్న తమ్ముళ్లు
- తాజాగా హైవే పక్కనున్న రూ.కోట్ల విలువ చేసే భూమి కబ్జాకు యత్నం
- మీడియా, స్థానికుల సమాచారంతో అడ్డుకున్న తహసీల్దార్

మర్రిపాడు: మండలంలో భూకబ్జాల పర్వం రోజురోజుకు పెరిగిపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. ఒక గ్రామంలో ఆక్రమణలను పరిశీలించి అధికారులు చర్యలు తీసుకుంటుండగానే మరో గ్రామంలో కబ్జాలకు పాల్పడుతున్నారు. ఇలా మండలంలోని కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండాపోతోంది. తాజాగా మరో భూకబ్జా పర్వం వెలుగులోకి వచ్చింది. మండలంలోని సింగనపల్లి వద్ద 565వ నంబర్ జాతీయ రహదారి పక్కన సర్వే నంబర్లు 42, 43లో ఉన్న కోట్లాది రూపాయల విలువ చేసే 12 ఎకరాల ప్రభుత్వ భూమిపై స్థానిక టీడీపీ నాయకుడు కన్నేశాడు. హైవే రాకతో భూముల ధరలు పెరగడంతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చదును చేశాడు. భూమి చుట్టూ కంచె వేసేందుకు రాళ్లను సైతం తోలాడు. ఇంతా జరుగుతున్న గ్రామ రెవెన్యూ అధికారులు కన్నెత్తి కూడా చూడలేదు. ఈ విషయాన్ని మీడియా, స్థానికులు తహసీల్దార్ అనిల్‌కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లడంతో హుటాహుటిన ఆక్రమణలను పరిశీలించి ప్రభుత్వ భూమిగా నిర్ధారించి ఎవరూ దిగవద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు.

ఆక్రమణదారులపై కఠిన చర్యలు

మండలంలో పలుచోట్ల భూ ఆక్రమణలు జరిగినట్లుగా మా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో ఇప్పటికే ఆక్రమణలను పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడం జరిగింది. ఎవరైనా ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. – అనిల్‌కుమార్‌యాదవ్, తహసీల్దారు, మర్రిపాడు

గతంలో మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ భూములను టీడీపీ నాయకులు చదును చేసి దర్జాగా కబ్జా చేసిన సమయంలో అధికారులు పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే రెండు రోజులు కూడా గడవక ముందే హెచ్చరిక బోర్డులను బేఖాతరు చేసి యథేచ్ఛగా భూములను తమపరం చేసుకున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వ పెద్దల ఆశీర్వాదం పొందిన పలువురు చోటా నేతలు కబ్జాల పర్వానికి తెరలేపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని గ్రామాల్లో రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి అసలు భూవిస్తీర్ణం కంటే రికార్డుల్లో ఎక్కువగా చూపించినట్లుగా సమాచారం. ఈ విషయం అర్జీల రూపంలో, మీడియా కథనాల ద్వారా అధికారుల దృష్టికి వెళ్లడంతో వారు సైతం ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటూ వస్తున్నారు. ఒకటి రెండు చోట్ల బైండోవర్ కేసులు కూడా నమోదు చేయించారు. అయినా కూడా ఆక్రమణల పర్వం ఆగడం లేదు. జిల్లాస్థాయి అధికారులు భూఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.